www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 6 జనవరి 2025
5
అన్నమయ్య

నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

కార్పొరేట్‌కు కట్టబెట్టేందుకే ఎపిఎండిసిలో టెండర్లు

- టెండర్ విధానాన్ని అమలు చేసే జిఒ97 రద్దు చేయాలి

-సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

మాట్లాడుతున్న శ్రీనివాసులు

ఎపిఎండిసిని కార్పొరేట్ కంపెనికి కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు ఆరోపించారు. ఆదివారం సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎపిఎండిసిలో 5వేల కోట్ల సేకరించడానికి అడ్వైజర్ కమ్ మార్చంట్ బ్యాంకర్ కమిటీ ఏర్పాటు చేస్తూ జిఒ నెంబర్ 97 విడుదల చేసిందని అన్నారు. ఈ కమిటీ ఇచ్చిన ఈ ప్రొకూర్మెంట్ టెండర్ ను పరిశీలన చేస్తే 5 వేల కోట్లు సేకరించడానికి బదులుగా 5వందల కోట్లు నష్టం వాటిల్లే విధంగా ఉందని అన్నారు. సిండిండబ్ల్యూ ఖనిజం రూ.1680లకు ఎగుమతి అవుతుంటే ప్రస్తుతం పిలిచిన టెండర్లో రూ.1188లు అమ్మడానికి నిర్ణయించారని, దీనివల్ల ఎపిఎండిసికి నష్టం వస్తుందని అన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రయివేట్ ఎక్స్ పోర్ట్ కంపెనీలను రద్దు చేసి ప్రభుత్వమే ఎగుమతి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనివల్ల ప్రత్యంగా, పరోక్షంగా 30 వేల కుటుంబాలు లాభ పడుతాయని, ప్రభుత్వానికి లాభం వస్తుందని నిపుణులు చెబుతున్నారని వివరించారు. ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీకి కట్టబెట్టే ఉద్దేశ్యంతో టెండర్లు పిలిచారని, ఈ టెండర్లు వల్ల ఇప్పటికే పనిచేస్తున్న 150కి పైగా పల్వరైసింగ్ పరిశ్రమలు, 50కి పైగా రసాయన పరిశ్రమలు మూత పడుతాయని చెప్పారు. ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా టెండర్లు రద్దు చేసి ప్రభుత్వమే ఎగుమతి చెయ్యాలని పేర్కొన్నారు. అడ్వైజర్ కమ్ మార్చంట్ బ్యాంకర్ కమిటీ ఏర్పాటు చేస్తూ జిఒ నెంబర్ 97 రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఎం ప్రత్యక్ష ఆందోళనకు దిగుతుందని హెచ్చరించారు.

భూ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-గాలివీడు

తలముడిపిలో పర్యటిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

అధికారులు భూ సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తలముడిపి పంచాయతీలో మంత్రి పర్యటించి గ్రామ ప్రజలు దగ్గర నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయని భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామని అన్నారు. భూ బాధితులు ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చు అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి సమస్యను పరిష్కరిం చడానికి ప్రతి గ్రామంలో మంచినీటి బోర్లను వేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పూలకుంట సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మాజీ సర్పంచులు గీదల ఈశ్వర్‌రెడ్డి, ఫరీద్‌బాషా , నరసింహారెడ్డి, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, టిడిపి నాయకులు ప్రభాకర్ రెడ్డి, నాగేశ్వరరావు, వీరాంజనేయులు, వెంకట శివారెడ్డి, మీటే నాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధికి స్ఫూర్తి ప్రదాత కెకె రెడ్డి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆకేపాటిని సన్మానిస్తున్న కెకె రెడ్డి

జన్మనిచ్చిన సొంత ఊరి రుణం తీర్చుకునేందుకు ఎన్ఆర్ కెకె రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పెద్దకారంపల్లి పంచాయతీ జడ్‌పి హైస్కూల్ విద్యార్థుల అభివృద్ధికి మన్నూరు రామలక్ష్మమ్మ, కీ.శే.మన్నూరు నారాయణరెడ్డి చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా తనకు విద్యాబుద్ధులు నేర్పించిన పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయం చేయడం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి దాయకమన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కూడా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ఉద్యోగరీత్యా కెకె రెడ్డి అమెరికాలో స్థిరపడినప్పటికీ జన్మనిచ్చిన సొంతూరు రుణం తీర్చుకునేందుకు పెద్ద కారంపల్లికి వచ్చిన ప్రతిసారి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ.. నిరుపేద కుటుంబాలలో వెలుగులు నింపుతున్నారని అన్నారు. ముఖ్యంగా నేటి యువత వారు సంపాదించే దానిలో కొంచెమైనా సమాజ శ్రేయస్సుకోసం ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం వీరబల్లి ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, యువ నాయకులు మదన్‌రెడ్డి మాట్లాడుతూ కెకే రెడ్డి రాజంపేట మండల కేంద్రంలోని పెద్దకారం పల్లెల్లో జన్మించడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు.ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు వెలకట్టలేనివని అన్నారు.పేద విద్యార్థులకు నిరంతర సేవా కార్యక్రమాలు కొనసాగించడం గొప్ప విషయం అన్నారు. కెకెరెడ్డి మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం తన చదివిన పాఠశాలలను సంద ర్శించి ఉపాధ్యాయులతో పాఠశాల అభివృద్ధిపై చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎస్.ఎస్.రాజు తమ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అవసరం అయ్యే మైక్ సెట్, కంప్యూటర్, స్టేజ్ నిర్మాణం కొరకు విరాళంగా హెడ్మాస్టర్, ఉపాధ్యాయ బృందానికి విద్యార్థుల సమక్షంలో అందించారన్నారు. అంతకు మునుపు కేకే రెడ్డి కుమార్తె సాయి మిత్ర, మేఘదీప్ వివాహ రిసెప్షన్ కార్యక్రమం సందర్భంగా తెలుగుదనం ఉట్టిపడేలా చెక్కభజనలు, కోలాటాలు, బ్యాండ్ మేళాలతో ఇంటి దగ్గర నుండి హై స్కూల్ ప్రాంగణం వరకు పండుగ వాతావరణంలో లాగా అట్టహాసంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి వివిధ మండలాల ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డిని కూడా ఘనంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మన్నూరు సుబ్బారెడ్డి, మన్నూరు నారాయణరెడ్డి, శుభోధ్ రెడ్డి, అశోక్ రెడ్డి, బాలాజీ, శివరామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్వాడీ నోటిఫికేషన్ రద్దు చేయాలి :'సిటు'

మాట్లాడుతున్న రామాంజులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

గత నెల 23న విడుదల చేసిన అంగన్వాడీ నోటిఫికేషన్ రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ గత నెల 23న జిల్లా లోని11 అంగన్వాడీ వర్కర్, 93 హెల్పర్, 12 మినీ వర్కర్ పోస్టు లకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. మదనపల్లి ప్రాజెక్ట్ పరిధిలో వేంపల్లి, కురవపల్లి కేంద్రాలలో హెల్పర్‌లు ప్రమోషన్‌కు అర్హత ఉన్నా వర్కర్‌గా ప్రమోషన్ ఇస్తామని చెప్పి ఇవ్వ కుండా నోటిఫికేషన్ ఇచ్చారని అన్నారు. అప్పారావుతోట కేంద్రానికి జిఒ ప్రకారం ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నా వర్కర్‌కు మొండి చెయ్యి చూపి ఇతరులతో సొమ్ము చేసుకునే పనిలో ఉన్నారని అన్నారు. అనేక చోట్ల రోస్టర్‌లు ఇష్టాను సారంగా మార్చేశారని ఆరోపించారు. ఈ అక్రమ నోటిఫికేషన్ వలన హెల్పర్ రిటైర్డ్ అయ్యే వరకు హెల్పర్‌గానే పని చెయ్యవలసి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ప్రమోషన్ ట్రాన్స్‌పర్ జిఒలను అమలు చేయకుండా వర్కర్స్, హెల్పర్‌లకు అన్యాయం కలిగించే నోటిఫికేషన్ రద్దు చేసి అర్హులకున్యాయం చేయాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారులు న్యాయవిచారణ జరిపాలని, వెంటనే నోటిఫికేషన్ రద్దు చేయాలని, లేని పక్షం లో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రాయచోటి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి వి.సిద్దమ్మ డి.భాగ్యలక్ష్మి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సి.రాంబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి పెన్షనర్ల ధ్రువపత్రాల పునఃపరిశీలన

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర ప్రభుత్వం నుంచి సామాజిక పెన్షన్లు అందుకుంటున్న బోగస్ లబ్ధిదారుల ఏరివేతను సోమవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు పీలేరు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ లతీఫ్‌ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీలేరు మండల పరిధిలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు ఇద్దరు వైద్యులతో విభిన్న ప్రతిభావంత పెన్షన్ లబ్ధిదారుల సదరం సర్టిఫికెట్లను వారి ఇంటి వద్దకే వెళ్లి పునః పరిశీలించనున్నట్లు చెప్పారు. ఈనెల 6న పీలేరు పట్టణంలోని 5వ సచివాలయంలోను, 7న రేగళ్ళు, బాలంవారిపల్లి, దొడ్డిపల్లి, అగ్రహారం సచివాలయాల్లోను, 8న వేపులబైలు, ముడుపులవేముల, బోడుమల్లువారిపల్లి, గూడరేవుపల్లి, తలుపుల, మేళ్లచెరువు సచివాలయాల్లో సదరం సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని అన్నారు. మండల పరిధిలోని 76 మంది లబ్ధిదారుల అర్హత పరీక్షలను చేపట్టనున్నట్లు చెప్పారు. వైద్య పరీక్షల అనంతరం నివేదికను ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుందని, ఈ విషయాన్ని లబ్ధిదారులకు నోటీసుల ద్వారా తెలియ పరచినట్లు పేర్కొన్నారు

తక్షణమే సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

మదనపల్లి, రామ సముద్రం మండలం మాలేనత్తం పంచాయతీ కొండూరు గ్రామ అంగన్వాడి వర్కర్ లావణ్యను వేధింపులకు గురిచేసిన సెక్టార్ సూపర్వైజర్ చంద్రకాంతమును తక్షణమే విధుల నుంచి తక్షణమే తప్పించాలని అంగన్వాడీ వర్కర్స్ జిల్లా అధ్యక్షులు, రైల్వే కోడూరు ప్రాజెక్టు కార్యదర్శి శ్రీలక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్షురాలు రమాదేవి ఆదివారం విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. అంగన్వాడీ సిబ్బందిపై సూపర్‌వైజర్ ఇలా పెత్తనం చెలాయించడం వల్లే లావణ్య ఆత్మహత్యాయనకి పాల్పడిందని తెలిపారు. పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోలేదని అన్నారు. ఆమె వేధింపుల తాళలేక ఆత్మహత్యానికి పాల్పడిందని తెలిపారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రాధాకుమారి, కోశాధికారి పద్మావతి పాల్గొన్నారు.

ప్రజా పునాదిని విస్తరించుకోవాలి

ప్రజా సమస్యలపై పోరాటాలే ఎజెండాగా ప్రజాపునాదిని విస్తరించుకోవడమే లక్ష్యంగా పని చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. రెండ్రోజులుగా కడప జిల్లా కేంద్రంగా జరుగుతున్న సిపిఎం జిల్లా 12వ మహాసభలు ఆదివారంతో ముగిశాయి. శని, ఆది వారం కడప జిల్లాలో మహాసభలు నిర్వహించారు. మొదటిరోజు భారీ ర్యాలీ, బహిరంగసభ నిర్వహించగా, రెండవరోజు కామ్రేడ్ సీతారాం ఏచూరిప్రాంగణం(అజ్మత్‌ఫంక్షన్)లో ప్రతినిధుల సభ నిర్వహించారు. కార్యక్రమానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి పరిశీలకులుగా హాజరయ్యారు. రెండ్రోజులుగా పలు అంశాలపై జరిగిన చర్చలను నిశితంగా పరిశీలించారు. పార్టీ గత మూడేళ్లలో చేపట్టిన కార్యక్రమాలు, విజ యాలపై చర్చించి, భవిష్యత్ కార్యక్రమాలను దిశానిర్దేశం చేశారు.

- మహాసభలో సిపిఎం నాయకుల వెల్లడి
- ఘనంగా ముగిసిన సిపిఎం కడప జిల్లా 12వ మహాసభ
- జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చోపచర్చలు
- భవిష్యత్ కర్తవ్యాలపై దిశానిర్దేశం
- చైతన్యం,ఉద్యమస్ఫూర్తితో సాగిన మహాసభ

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ. గఫూర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/ కడప అర్బన్

కడపలో రెండ్రోజులపాటు సిపిఎం జిల్లా మహాసభలు ఉత్సాహంగా ఉల్లాసంగా సాగాయి. రాబోయే మూడేళ్లలో చేపట్టాల్సిన భవిష్యత్ కర్తవ్యాలపై నాయకులు చేసిన ప్రసంగాలు సిపిఎం శ్రేణు లను ఉత్సాహపరిచాయి. మహాసభలో అనేక అంశాలపై పలు తీర్మానాలు చేశారు. జిల్లా సమగ్రాభివృద్ధిపై, సాగునీటి ప్రాజెక్టులు విద్య, యువజన, కార్మిక, కర్షక రంగాలు మొదలగు రంగాల సమస్యలపై మహాసభలో చర్చించారు.అనంతరం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ గఫూర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. దేశాన్ని ఓ అబద్దాల కోరు పాలిస్తున్నారని, కుల,మతాల పేరుతో ప్రజల్లో విద్వేష బీజాలు నాటుతున్నారని విమర్శించారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధి కారాన్ని అడ్డం పెట్టుకుని పెడధోరణుల్ని విస్తరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి విపరీత ధోరణుల్ని తిప్పికొట్టడానికి అవ సరమైన ఎత్తుగడలను రూపకల్పన చేయాలన్నారు. బిజెపి కుల, మత రాజకీయాలను తిప్పకొట్టి, దేశంలో ఐక్యతను తీసుకొచ్చే ప్రయత్నాలను ముమ్మరం చేయాలని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటాలు సాగిస్తూనే పార్టీ పునాదిని విస్తరింపజేయాలని సూచించారు. బిజెపి రాయలసీమ డిక్లరేషన్ పేరుతో, టిడిపి అమరావతి, పోల వరం అజెండాతో ముందుకెళ్తూ, రాయలసీమను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. కరువు పీడిత ప్రాంతాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వకుండా, ఇష్టానుసారంగా రాజకీయాలు సాగించడం దివాళా కోరుతనమన్నారు. కొప్పర్తి నుంచి ఎంఎస్ఎంఇ, ఎపిబిజి, నార్కోటిక్ డ్రగ్ లీగల్ కోర్టులను తరలించడం దుర్మార్గమని చెప్పారు. వైసిపి నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి భూఆక్రమణల విచారణపై డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు ఉన్న శ్రద్ధ, జిల్లాలో లక్షలాది ఎకరాలు ఆక్రమించుకున్న పెద్దలపై విచారణకు ఎందుకు ఆదేశించరని ప్రశ్నించారు. టిడిపి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. విద్యుత్ ఛార్జీలను పెంచబోమని హామీనిచ్చి, భారీగా ఛార్జీలను పెంచడం బాధాకరమని తెలిపారు. పేదలకు భూములు పంపిణీపై దృష్టి సారించి పోరాటాలు రూపొందించాల్సి ఉందన్నారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రైతుల బలవన్మరణాల నిలువరించడం లేదన్నారు. ఎం.ఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసు లను అమలు చేయడంతోపాటు రైతులకు గిట్టుబాటు ధరల కల్పన, అన్‌సెక్యూరిటీ రుణాలు, సబ్సిడీతో వ్యవసాయ పరికరాలను అందిస్తే రైతుల ఆత్మహత్యలు ఆగిపోయే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గడిచిన మూడేళ్లలో సిపిఎం అనేక ఆందోళనా కార్యక్రమాలు చేపట్టిందని, వీటిని మరింత ఉధృతంగా చేపట్టడానికి ప్రజా సంఘాలను విస్తరించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజాసమస్యలపై పోరాటాలే అజెండా పార్టీని బలోపేతం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. కార్మికులు, కర్షకుల తరుపున నిలబడి పోరాటాలను కొన సాగించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. రాబోయే మూడేళ్లలో జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సమష్టిగా పోరాటం చేయాలని చెప్పా రు. అనంతరం 16 మందితో సిపిఎం జిల్లా కమిటీ ఎన్నిక నిర్వ హి ంచారు. ఇందులోని ఐదుగురితో కార్యవర్గం ఎన్నికైంది.

సిపిఎం సీనియర్ నాయకురాలికి సన్మానం

సిపిఎం సీనియర్ నాయకురాలు ఐ.ఎన్.సుబ్బమ్మకు సన్మానం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, ఇతర నాయకులతో కలిసి శాలువా కప్పి సన్మానం చేశారు. 1986 నుంచి 2025 వరకు 39 ఏళ్లపాటు ఆమె సాగించిన పోరాటాలు శ్లాఘనీ యమన్నారు. ఇంతటి సుదీర్ఘకాలం ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి పని చేయడం ఆదర్శనీయమన్నారు. అంతకు ముందు ఆమె మాట్లాడిన తన తుదిశ్వాస వరకు పార్టీ కోసం సేవలందిస్తూ ఉంటా ననే చిత్తశుద్ధిని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సిపిఎం సీనియర్ నాయకులు ఐ.ఎన్. సుబ్బమ్మను సన్మానిస్తున్న నాయకులు

పశు వ్యాధుల నివారణకు కృషి

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె.గుణశేఖర్ పిళ్లై

ముఖా ముఖి..

ప్రజాశక్తి -రాయచోటి

జిల్లాలో పాడి రైతులకు అందుబాటులో ఉండి ఆవులు, గేదెలు , గొర్రెలు, మేకలకు వ్యాధుల నివారణకు కృషి చేస్తానని జిల్లా పశు సంవర్తక శాఖ అధికారి కె.గుణశేఖర్ పిళ్లై పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో పశు సంవర్ధక శాఖ అమలు చేస్తున్న పథకాలు, పాడి రైతుల పెంపకం, వ్యాధులు నివారణ, అధిక పాలు అధిక దిగుబడి, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, రైతులు ఎలా పొందాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

జిల్లాలో పశుసంవర్ధక శాఖ కార్యాలయాల వివరాలు తెలపండి?

జిల్లా వ్యాప్తంగా 6 నియోజకవర్గాలలో 30 మండలాల్లో 3 డివిజన్‌లలో రాయచోటి మదనపల్లె, రాజంపేట ప్రాంతాలలో ఉప సంచాలకులు ఉన్నారు. మూడు డివిజన్లో 18 మంది సహాయ సంచాలకులు (ఎడిలు), పశు వైద్యాధికారులు 72 మంది, గ్రామీణ పశువైద్యాధికారులు 63 మంది ఉన్నారు. 226 రైతు సేవా కేంద్రాలలో పశువైద్య సహాయకులు, 116 మంది గోపాల మిత్రలు జిల్లా వ్యాప్తంగా ఉన్నారు.

జిల్లాలో ఆవులు, గేదెలు వివరాలు తెలియజేయండి ?

జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,24,325 ఆవులు, గేదెలున్నాయి. ఇందులో 1,00,588 గేదెలు, 2,76,417 ఆవులు , గొర్రెలు, మేకలు మొత్తం 2,77,695 ఉన్నాయి. ఇందులో 13,24,325 గొర్రెలు, 3,53,370 ఉన్నాయి. 23,82,260 కోళ్లు, మదనపల్లె, పీలేరు, కలికిరి ప్రాంతాల నందు కోళ్ల పారాలు ఎక్కువగా ఉన్నాయి.

పశు సమగ్ర శాఖ అధికారుల పని వివరాలు తెలపండి?

పసుపు సమగ్ర శాఖ అధికారులు గ్రామీణ ప్రాంతాలలో పశువులకు ప్రాథమిక చికిత్స చేయించడం. గొర్రెలు, మేకలు, గేదెలకు వ్యాధులను గుర్తించడం. వాటి కావాల్సిన టీకాలు వేయించడం. ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ విత్తనాలు పంపిణీ, గడ్డి విత్తనాలు, యంత్రాలు, పశువులకు బీమా సంక్షేమ కార్యక్రమాలు ప్రభుత్వ నుంచి వచ్చే పథకాలకు పై ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో వంటి కార్యక్రమాలను, అవగాహన సదస్సులు వంటి కార్యక్రమాలు రైతులకు వివరిస్తాం.

పశువులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నారా ?

జిల్లాలో ప్రతి రైతూ పశువులకు బీమా చేయించుకోవాలి. జిల్లాలో ఇప్పటివరకు మృతి చెందిన పశువులకు బీమా చెల్లించాం. ప్రస్తుతం బీమా పథకం కొనసాగిస్తున్నాం. దారిద్ర రేఖకు దిగువన ఉన్న రైతులు వారి పశువులు చెల్లించిన ప్రీమియం 80 శాతంలో రాయితీతో 20 శాతం రైతు కట్టాలి. ఒక రైతు ఐదు పశువులకు వరకు బీమా చేసుకోవచ్చు. 50 గొర్రెలు, మేకలకు బీమా చేసుకోవచ్చును. మూడు సంవత్సరాల లోపు మరణిస్తే సమీప పశు సంవర్ధ శాఖ వారు నష్టపరిహారం చెల్లిస్తుంది.

జిల్లాలో శిథివస్థకు చేరిన పశుసంవర్ధక శాఖ కార్యాలయాలు ఎన్ని ఉన్నాయి ?

జిల్లాలో మొత్తం 70 పశుసంవర్ధ శాఖ భవనాలు ఉన్నాయి. అందులో 13 భవనాలను వరకు శిథిల వ్యవస్థకు చేరాయి. వాటి వివరాలు ఉన్నతాధికారులకు ప్రతిపాదించాం. బడ్జెట్ మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

పశుగ్రాస అభివృద్ధికి ఎలా చర్యలు తీసుకుంటున్నారు ?

ప్రస్తుతం జిల్లాలో 70 శాతం రాయితీతో 30 టన్నులు గడ్డి విత్తనాలు సరఫరాకు ప్రతిపాదనలు పంపాం. మొదట దశగా 175 టన్నులు గడ్డి విత్తనాలు వచ్చాయి. సమీప రైతు సేవా కేంద్రంలోకి అందుబాటులో ఉన్నాయి. అవగాహన కలిగించడానికి తమ సిబ్బంది గ్రామాన్ని సందర్శిస్తారు. వారికి రైతులు సహకరించి ముందస్తు టీకాలు వేయించుకోవడం ద్వారా అంటు వ్యాధులను మీ పశువుల కాపాడుకోవచ్చు. నవంబర్ 20వ తేదీ నుండి డిసెంబర్ 18 వరకు జాతీయ వ్యాధి నివారణ కొరకు జిల్లాలో 99 శాతం టీకాలు వేశాం. పిల్లి సరక వ్యాధి నివారణ కోసం జిల్లాకు 19,18000 టీకాలు సరఫరా అయ్యాయి. ఇందులో 1500 పేయదూడలకు 19 లక్షలు పైగా 99 శాతం టీకాలు డిసెంబర్ 1 నుండి 31 వరకు వేశాం.

జిల్లాలో సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లా వ్యాప్తంగా పశుసంవర్ధక శాఖ కార్యాలయాల్లో గతంలో సిబ్బంది కొరత ఉండేది. ప్రస్తుతం ఎటువంటి సిబ్బంది కొరత లేదు.

నిరుద్యోగులు ఉపాధి ఆదాయం పొందవచ్చా?

గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగులు, విరమణ పొందిన ఉద్యోగులు, ఇతరులకు జిల్లాలో పాడి పరిశ్రమ ఎంతో ఉపయోగపడుతుంది. పాడి పెంపకం ద్వారా పాలతో ఆర్థిక లాభాలు సాధించవచ్చు. గ్రామీణ ప్రాంతాలలో కూడా పాల డైయిరీలు అందుబాటులో ఉన్నాయి. పాల వ్యాపారంతో అదిక దిగుబడి సాధించవచ్చును. దీనివలన నిరుద్యోగకు ఉపాధి కలుగుతుంది.

పాడే రైతులకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి ?

జిల్లావ్యాప్తంగా ఉండే నిరుద్యోగులు కూడా పశువులను తీసుకొని పెంపుకోవాలి. పాడి రైతులు పశువుల ప్రాణాలను కాపాడుకోవాలి. ప్రతి ఒక్క రైతు పశువులకు బీమా చేయించుకోవాలి. తమ సిబ్బంది వచ్చినప్పుడు రైతులు పశువులకు టీకాలు వేయించుకోవాలి. ప్రభుత్వ అందిస్తున్నటువంటి సదుపాయాలను పాడి రైతుల ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి.

పుస్తకావిష్కరణ చేస్తున్న సురేందర్‌రెడ్డి

12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి

ప్రజాశక్తి-కలికిరి

ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు షాదీ మహాల్‌లో పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వేంపల్లి అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి మాట్లా డుతూ 12 పిఆర్‌సి అమలు చేయాలని, రావలసిన రెండు డిఎలు త్వరగా ఇవ్వాలని ప్రభు త్వాన్ని కోరడం జరిగింది. ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ విహారయాత్ర తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. వేంపల్లి అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ చరక అనే పేరు మీద సామాజిక సాంఘిక రాజకీయ వ్యవహారాలను నిజ పరిస్థితులను వివరించే కవితలు చదివి వినిపించారు. లైవ్ సర్టిఫికెట్ ఫిబ్రవరి 28వ తేదీ లోపు అందరూ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు బస వయ్య, నాగప్ప, సుబ్బరాజులు శెట్టి నారాయణరెడ్డి, వై.కృష్ణారెడ్డి, జి.జయరాం, రాజగోపాల్, సరోజమ్మ, ఎం.కాంతమ్మ, టి.రమణారెడ్డి, ఇసి వెంకటస్వామి పాల్గొన్నారు.

మంత్రి సతీమణి నుంచి బహుమతి అందుకుంటున్న ఎంఇఒ

ముగ్గుల పోటీల్లో ప్రథమ స్థానం

ప్రజాశక్తి-సుండుపల్లి

జిల్లా కేంద్రం రాయచోటి అర్చన పాఠశాలలో నిర్వహించిన సమగ్ర నైపుణ్యాభివృద్ధి, ముగ్గుల పోటీల్లో మండలానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి మొదటి బహుమతి సాధించారని డిఇఒ ఎం.రవీంద్రనాయక్ తెలిపారు. ఆదివారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత చేతుల మీదుగా బహుమతి అందుకున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌పిలు రామ్మోహన్, శివప్రసాద్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8న ఐటిఐలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి ప్రభుత్వ ఐటిఐలో 8న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడాప్, ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పది, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ చదివిన విద్యార్థులు అర్హులన్నారు. 18 నుంచి 30 సంవత్సరాలు వయసు గల నిరుద్యోగ యువత తమ బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫోటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని ఉద్యోగవకాశాలు పొందుకోవాలని సూచించారు.

9న మల్లయ్య కొండపై తలనీలాల సేకరణ వేలం

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

స్థానిక తంబళ్లపల్లిమల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థా లో పలు పనులకు ఏడాది పాటు హక్కుల పొందడానికి ఈనెల 9న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట జరుగుతుందని ఇఒ మునికుమార్ తెలిపారు. తలనీలాల సేకరణకు పాట దారుడు లక్ష రూపాయలు ధరావత్తు, వాహన పార్కింగ్ ధరావత్తు లక్ష రూపాయలు, గౌరమ్మ గుడి పూజ సామగ్రి అమ్ముకొనుటకు ధరావత్తు రూ.50వేలు చెల్లించాలన్నారు. కొబ్బరి చిప్పల సేకరణ హక్కు కొరకు ధరావత్తు రూ.50వేలు, దేవస్థానం వద్ద చెప్పులు పోగు చేసుకొనుట హక్కును ధరావత్తు రూ.10వేలు, దేవస్థానం వద్ద కొండపైన టెంకాయలు పూజ సామగ్రి కూల్‌డ్రింక్స్ దుకాణాలు, వివిధ రకాల అంగళ్లు పెట్టుకుని అమ్ముకొని హక్కు ధరావత్తు రూ.50వేలు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

షిఫ్ట్ ఆపరేటర్లకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - రామసముద్రం

మదనపల్లి డివిజన్ రామసముద్రం సెక్షన్‌లో ఉన్న 5 సబ్ స్టేషన్లలో ముగ్గురు షిఫ్ట్ ఆపరేటర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని, షిఫ్ట్ ఆపరేటర్లతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆంధ్ర ప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సుధాకర్ పేర్కొన్నారు. 5 సబ్ స్టేషన్లలో ఒక షిఫ్ట్ ఆపరేటర్ శాలరీ మొత్తంగా ఐదుగురు కార్మికుల జీతం దాదాపు లక్ష రూపాయలు. మూడు సంవత్స రాలుగా విధులకు హాజరు కాకుండా ఉండే వారికి జీతాలు చెల్లిస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ సంస్థలో ఉన్నటువంటి అధికారులు విధులకు హాజరుకాని వారికి జీతాలు చెల్లిస్తూ, లక్షల రూపాయలు చేతులు మారడంపై ఎస్ఇ, డిఇ స్పందించాలని తెలిపారు. మూడు సంవత్సరాలుగా జరుగుతున్న దాదాపు రూ.35 లక్షలు దోపిడీ నివారించాలన్నారు. లేనిపక్షంలో చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎపిఎస్‌పిడిసిఎల్ దృష్టికి తీసుకె ళతామని తెలిపారు. నలుగురు షిఫ్ట్ ఆపరేటర్లు చేయవలసిన పనిని ముగ్గురితో చేపిస్తూ వెట్టిచాకిరి చేయి స్తున్నారని, వారికి వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రామసముద్రం సెక్షన్‌లో జరుగుతున్న టువంటి షిఫ్ట్ ఆపరేటర్ జీతాలు మళ్లింపు అరికట్టేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఘనంగా మాజీ ఎంపిటిసి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-రామసముద్రం

మండల కేంద్రంలో వైసిపి మాజీ ఎంపిటిసి, విఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు దొడ్డిపల్లి ఆనంద్ పుట్టినరోజు వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తూ తనవంతు కృషితో మండల ప్రజలకు తోడుగా ఎల్లప్పుడు ఉంటానని మండల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. మండల నాయకులు సహకారంతో ముందుకు వెళ్తానని తెలిపారు. తన 46వ పుట్టినరోజు వేడుకలు తన అభిమానుల మధ్యలో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజా సేవే ధ్యేయంగా పనిచేస్తానని, వైసిపి బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ నంద కిషోర్ రెడ్డి, సి.హెచ్ ప్రకాష్, ఎంపిటిసి రెడ్డెప్ప, మాజీ మండల మాల మహానాడు అధ్యక్షులు అంబరీష్, కృష్ణ, బసప్ప, కేశవ, కొమ్ము నారాయణ స్వామి, వెంకటేష్ రెడ్డి, సుబ్బన్న,రమణప్ప, కృష్ణప్ప, జబి, రవి పాల్గొన్నారు.

జన్మదిన వేడుకల్లో ఆనంద్, అభిమానులు

రోడ్డు అధ్వానం..ప్రయాణం దుర్భరం

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడు బస్టాండ్ నుంచి ప్రాథమిక పాఠశాల వరకు రోడ్డు దుస్థితి అధ్వానంగా ఉందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు ద్వారానే చిలకలూరిపేట, అరవీటివాళ్ళపల్లి, నాయన వారిపల్లి, దక్షిణ గడ్డ దళితవాడ, కోటగాడుపల్లి, పేరంపల్లికి వెళ్లాల్సి ఉందన్నారు. వర్షం వచ్చిందంటే గుంతల మయంగా ఉన్న రోడ్డుపై నీరు నిలిచి వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది ఉందని అన్నారు. మురుగు నిలిచి ఉండటంతో దోమలు విజృంభించి ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని అన్నారు. పట్టణంలో ప్రధాన రహదారి బస్టాండ్ వద్దనే పరిస్థితి ఈ విధంగా ఉంటే చుట్టుపక్క పరిస్థితి ఏవిధంగా ఉంటా యో ఊహించుకోవచ్చునని అంటున్నారు.ఇప్పటికైనా పంచాయతీ అధికా రులు దృష్టి పెట్టి అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

గుంతల మయంగా ఉన్న రోడ్డు

హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి ప్రత్యేక కమిటీ

మాట్లాడుతున్న శ్రీనివాసులు నాయుడు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బసినికొండ పంచాయతీ, గంగన్నగారిపల్లి వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు మాజీ సైనిక సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు పేర్కొన్నారు. ఆదివారం నిమ్మనపల్లి సర్కిల్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన హిందూ శ్మశానవాటిక అభివృద్ధి సమావేశానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్య అతిథిగా హాజరై స్మశాన వాటిక అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారని అన్నారు. ముస్లిం మైనార్టీ ఎమ్మెల్యే హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి సహకారం అందిస్తామనడం శుభసూచకమని, అలాంటి ఎమ్మెల్యే పట్ల హిందువులంతా గర్వపడాలన్నారు. రూ.కోటితో శ్మశాన వాటిక అభివృద్ధికి ఆయన భరోసానిచ్చారని చెప్పారు. శ్మశానవాటిక అభివృద్ధికి కమిటీని నియమిస్తున్నామని, ఆ కమిటికి ఎమ్మెల్యే గౌరవ అధ్యక్షులుగా ఉంటారని, ఆయన ఆదేశాల మేరకు నూతన కమిటీని ఎన్నుకొని స్మశాన వాటికి అభివృద్ధికి శ్రీకారం చుడుతామని తెలిపారు. ఇందుకు విరాళాలు అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్రాంతి కానుక ఏదీ చంద్రన్నా?

ప్రజాశక్తి- వేంపల్లె

చంద్రబాబు సారథ్యంలో టిడిపి ప్రభుత్వం 2014లో అమలు చేసిన చంద్రన్న సంక్రాంతి కానుకను గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా ఎత్తివేసింది. టిడిపి పాలనలో పండుగల వేళ కొన్ని సరుకులను లబ్దిదారులకు అందించేవారు. క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. వైసిపి ప్రభుత్వం వాటిని పక్కన పెట్టి కేవలం బియ్యం, పంచదార, కందిపప్పు, మాత్రమే పంపిణీ చేసింది. చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇప్పుడు సంక్రాంతి కానుకల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సంక్రాంతికి చంద్రన్న కానుకను అందజేస్తారా? లేదా? అనే ప్రశ్నలు సర్వత్రావ్యక్తం అవుతున్నాయి. క్రిస్మస్ కానుకను మరిచిపోయిన కూటమి ప్రభుత్వం సంక్రాంతి కానుకనైనా ఇవ్వాలని పలువురు లబ్దిదారులు కోరుతున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం 2019 వరకు పండుగల వేళ కానుకలు అందించింది. ఒక్కో కార్డుదారునికి ఉచితంగా రూ.207.94 పైసలు విలువ చేసే 6 రకాల వస్తువులు గోధుమ పిండి, శనగపప్పు, బెల్లం, నెయ్యి, పామాయిల్, కందిపప్పును ఒక సంచిలో పంపిణీ చేసేవారు. చంద్రన్న కానుకపై కూటమి ప్రభుత్వం ప్రకటన చేయక పోవడంతో ఈ సంక్రాంతికి ప్రత్యేక కానుకలు లేనట్లేనని తెలుస్తోంది. ఎందుకంటే ప్రభుత్వం ఇప్పటి వరకు దీనిపై ఎటువంటి ప్రకటన చేయలేదు. చంద్రబాబు సర్కారులో ప్రతి ఎడాది ఈ పథకం కోసం రాష్ట్రవ్యాప్తంగా వందల కోట్లు ఖర్చు చేసేవారు. ఈ ఏడాది సంక్రాంతి సమీపిస్తున్న ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఒకవేళ ఇవ్వాలని అనుకుంటే జనవరి 1 నుంచే పంపిణీ చేయాల్సి ఉంది. దీని గురించి జిల్లాలో అటువంటి పరిస్థితి ఏమీ కనిపించడం లేదు. ఏడు నెలల కిందట అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఐదుళ్లకు ముందు అమలు చేసిన అనేక పథకాలను పునరుద్ధరిస్తామని చెప్పుకొచ్చింది. చివరకు క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ కానుకలను కూడా అందిస్తామని హామీ ఇచ్చింది. ఆచరణలో మాత్రం కానుకల సంగతిని కూటమి పాలకులు మర్చిపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ప్రజలు ఎంతో ఆదరించిన చంద్రన్న సంక్రాంతి కానుకలు మళ్లీ ఇస్తారని లబ్దిదారులు ఆశిస్తున్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం దీనిపై ఎటువంటి ఆసక్తి చూపకపోతుండడంపై సంక్రాంతి కానుక పథకం అమలయ్యే అవకాశాలు దాదాపుగా కనిపించడం లేదు. మండలం వ్యాప్తంగా దాదాపు 20 వేల రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిపోవడంతో నెలనెలా పింఛన్లు, జీతాలకే గగ్గోలు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో పలు సంక్షేమ పథకాలకు ప్రభుత్వం దూరంగా ఉన్నట్లు కనిపిస్తోంది.

ఛార్జీల బాదుడు, అప్పులు చేయడంలో దొందూదొందే

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పన్నులు, ఛార్జీలతో ప్రజలను బాదడంలో, ప్రజల పేరుతో అప్పులు చేయడంలో వైసిపి, టిడిపి దొందూదొందేనని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. పులివెందులలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన 7 నెలల్లోనే విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై రు.15,485 కోట్ల అదనపు భారం మోపిందన్నారు. త్వరలో భూములు, స్థలాలు, ఇళ్లపై 20 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచబోతున్నారని తెలిపారు. నగరాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాపై యూజర్ ఛార్జీలు విధించబోతున్నారని పేర్కొన్నారు. వస్తువుల రవాణాపై ఒక శాతం వరద సెస్సు వేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడం శోచనీయమన్నారు. అప్పుల విషయంలో టిడిపి కూటమి తీరును ఎద్దేవా చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ.లక్ష కోట్లపై చిలుకు అప్పు చేసిందన్నారు. సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు తిరుపాల్‌రెడ్డి, నాగరాజు, శివ, వెంగల్‌రెడ్డి, ధనుష్, అమర్‌నాథ్‌రెడ్డి, చిన్నకోట నాగరాజు, వినయ్ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

నేత్రదానం.. ఇద్దరు అంధులకు చూపు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపువస్తుందని నేత్ర నిధి టెక్నీషియన్ హరీష్ తెలిపారు. పట్టణంలోని జడలమ్మ వీధికి చెందిన యల్లటూరు మునికాంతమ్మ మరణించడంతో ఆమె భర్త లక్ష్మిరెడ్డి, కుమారులు చిరంజీవిరెడ్డి, గిరినాథరెడ్డి, కుమార్తెలు మారుతీదేవి, హైమావతి దేవి మృతురాలి నేత్రదానానికి అంగీకరించారు. విషయాన్ని జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు తెలిపారు. టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతురాలి ఇంటివద్దకెళ్లి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ బంధువులు, సన్నిహితులు మరణిస్తే వారి నేత్ర దానానికి అంగీకరిస్తే 99666 09364, 70932 04537 నెంబర్లను సంప్ర దించాలన్నారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు బంధు వులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.



పదవులు పొందిన వారిని సన్మానిస్తున్న రామచంద్రారెడ్డి

వైసిపి బలోపేతానికి కృషి చేద్దాం

ప్రజాశక్తి-పీలేరు

వైసిపి బలోపేతానికి క్షేత్రస్థాయి నుంచి కృషి చేద్దామని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీలో కొత్తగా పార్టీ పదవులు పొందిన వైసిపి అన్నమయ్య జిల్లా అధికార ప్రతినిధి జి. జయరామ చంద్రయ్య, జిల్లా క్రియాశీలక కార్యదర్శిగా ఆనంద్, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శిగా నారే వెంకటరమణారెడ్డి నియామకం కావడంతో వీరు ముగ్గురినీ ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పూర్వ వైభవానికి తమ వంతు కషిచేయాన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి ఎప్పుడు తగిన గుర్తింపు ఉంటుందని, ప్రతి కార్యకర్త వైసిపి బలోపేతానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాషా, ఎంపిటిసి అమరనాథ రెడ్డి, నాయకులు చక్రధర్, కాలనీ చిన్న, ఉదయ్ కుమార్, విక్టరీ వెంకటరమణారెడ్డి, మల్లి, ఆనందరెడ్డి, మోహన్, దావూద్, షాకీర్, ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు.

సబ్ జూనియర్, జూనియర్ జిల్లా హాకీ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జిల్లా సబ్ జూనియర్, జూనియర్ హాకీ జట్టను ఆదివారం ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు అరవై మంది క్రీడాకారులు పాల్గొన్నారు. స్థానిక వైఎస్ఆర్ ఇంటిగ్రేట్ హాకీ స్టేడియంలో నిర్వహించిన ఎంపికలో అత్యధికంగా పాల్గొన్న క్రీడాకారుల నుంచి మంచి ప్రతిభ కనబరచిన క్రీడా కారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ పిఇటి కృష్ణమూరి, హాకీ సెక్రెటరీ శేఖర్ పర్యవేక్షించారు. క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. చక్కగా ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను కోచ్‌లు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఖాన్ బాషా, అనిల్ కుమార్, డేవిడ్ కుమార్, ఉదయ్ దీపు, శౌరి కుమార్, దినకర్, రవికుమార్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పనే లక్ష్యం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే తమ లక్ష్యమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని అహోబిలపురం ఉన్నత పాఠశాలలో ఆదివారం మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఎంతోమంది ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, ఎంటెక్ చేసిన విద్యార్థులు నిరుద్యోగులుగా ఉన్నారన్నారు. వీరి కోసం 27 కంపెనీల ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే 2,450 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారి నైపుణ్యాన్ని బట్టి సంబంధిత కంపెనీలు ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చే దశగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ సహాయ సహకారాలతో ఇలాంటి కార్యక్రమాలను మరెన్నో చేపట్టనున్నట్లు వివరించారు.

సర్వేలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సర్వే చేయడంలో గ్రామ సచివాలయంల సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపిడిఒ కృష్ణమూర్తి హెచ్చరించారు. ఆ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇళ్ల జియో ట్యాగ్ సర్వే, పిఎసిఎస్, ఎంఎస్ఎంఈ సర్వే చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారన్నారు. అయితే కొంతమంది సర్వే చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలోని సచివాలయ సిబ్బంది సర్వేలు చేసి నివేదికలను త్వరగా అందజేయాలని ఆయన ఆదేశించారు. సర్వే పూర్తి చేయని సిబ్బందిపై కలెక్టర్ ఆదేశాల మేరకు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ హెచ్చరించారు.

ముందస్తు సంక్రాంతి వేడుకల్లో ఎమ్మెల్యే శ్రీధర్, సాయివికాస్‌రెడ్డి

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయా లని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ పేర్కొన్నారు. పట్టణంలోని విక్టరీ హైస్కూల్ లో విద్యాసంస్థల కరస్పాండెంట్ విక్టరీ నరసింహారెడ్డి, ప్రిన్సిపల్ విక్టరీ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అన్నమయ్య, కడప, తిరుపతి జిల్లాల ప్రయివేట్ విద్యాసంస్థల యాజమాన్యాల ఆత్మీయ సమావేశం, సంక్రాతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, యువనేత ముక్కా సాయివికాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు వారు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రయివేట్ విద్యా సంస్థల కరస్పాండెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త ఏడాదిలో మరిన్ని సేవలందించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో కరాటే, స్పోర్ట్స్, యోగా శిక్షణ తోపాటు విశేష సేవ కార్యక్రమాలు నిర్వహించే యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు గ్రాండ్ మాస్టర్ డాక్టర్ ఎఆర్.సురేష్ మరిన్ని సేవలు అందించాలని పలువురు పుర ప్రముఖులు ఆకాంక్షించారు. ఆదివారం యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ నూతన కేలండర్‌ను సీనియర్ టిడిపి నాయకులు తులసీ రామకృష్ణ ఆచారి, బీసీ హాస్టల్ వార్డెన్ వెంకటేష్, సత్యనారాయణ మెడికల్ స్టోర్ అధినేత సత్యప్రసాద్ హాజరై క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురేష్ సమాజసేవలో రాణిస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడన్నారు. ఆత్మస్థైర్యాన్ని ఇచ్చే కరాటేలో శిక్షణ ఇస్తూ మదనపల్లె పేరును అంతర్జాతీయ స్థాయిలో వినబడేలా వివిధ ఛాంపియన్ షిప్ పోటీల్లో పథకాలు సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘ నాయకులు యుగంధర్‌ఆచారి, మిట్స్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డిఎం.అభినయ్‌కాంత్, ఎస్.ప్రభాకర్, బసినికొండ రమణ, కరాటే బ్లాక్‌బెల్ట్ షేక్ మిస్బా, ఎస్.మోహిబుల్ రెహ్మాన్, ఎస్.కాలేషా మస్తాన్ పాల్గొన్నారు.

విద్యార్థులు సేకరించిన నిత్యావసర వస్తువులతో కరస్పాండెంట్లు

విద్యార్థులు నైతిక విలువలు పెంచుకోవాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

విద్యార్థులు చిన్నతనం నుంచే సేవాగుణం, నైతిక విలువలు పెంపొందించుకోవాలని పట్టణంలోని భారత్, విద్యార్థి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్స్ డైరెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. నైతిక విలువలు,సేవాగుణం అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో విద్యార్థులు 10 క్వింటాళ్ల బియ్యం, వందమందికి దుస్తులు పోగుచేసి ఆదివారం మదనపల్లి పట్టణం, అమ్మచెరువు మిట్ట వద్ద గల వెలుగు ప్రత్యేక పాఠశాల సెక్రటరీ ఎం.ఉదయ మోహన్ రెడ్డికి అందజేశారు. విద్యార్థి హైస్కూల్ కరస్పాండెంట్ ఉమరమణ కుమార్తె నవోమిక, భారత హైస్కూల్ కరస్పాండెంట్ జహనార ఇనాయతుల్లా సహాయ, సహకారంతో ముఖ్యంగా భారత్ హైస్కూల్ విద్యార్థుల సహకారంతో ఇంతటి బృహత్కార్యక్రమం చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు మానవత్వం ,నైతిక విలువలు,సేవాగుణం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం వల్ల సేవాభావం పెరిగిందన్నారు. విద్యార్థుల చేత ఇలాంటి కార్యక్రమాలు చేయించడం ద్వారా వారిలో సేవాస్ఫూర్తిని పెంపొందించవచ్చని అన్నారు. నవ సమాజ నిర్మాణానికి తమవంతు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు. సహకరించిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

జాబ్‌మేళాలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కీలకం

ప్రజాశక్తి - వేంపల్లె :పులివెందులలో నిర్వహించిన జాబ్‌మేళా సజావుగా నిర్వహించడంలో ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కీలక పాత్ర పోషించినట్లు ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. ఆదివారం పులివెందులలో 2 వేల మందికి పైగా యువత జాబ్‌మేళాలో పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రిజిస్ట్రేషన్, క్రౌడ్ మేనేజ్‌మెంట్‌తో సహ వివిధ పనుల్లో పాల్గొని జాబ్‌మేళాను విజయవంతం చేశారన్నారు. జాబ్‌మేళాను విజయవంతం చేసిన ఎన్ఎస్ఎస్ యూనిట్-9 విద్యార్థులకు డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్ కుమార్‌రెడ్డి అభినందనలు తెలిపారు

ప్రభుత్వ పథకాలపై వాస్తవాలను మాట్లాడాలి

ప్రజాశక్తి - చాపాడు :ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై వైసిపి నాయకులు, పార్టీ అధినేత వాస్తవాలను మాట్లాడాలని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన మాట్లా డుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. 2019 మేనిఫెస్టోలో అధికారంలోకి వస్తే ఒక కుటుంబంలో ఎంతమంది బడికి పోయే పిల్లలు ఉన్నా రూ.15వేలు వేస్తామని మాట ఇచ్చి తప్పారని గుర్తు చేశారు. రైతు భరోసా పథకం కూడా కేంద్రంతో సంబంధం లేకుండా రూ.12వేలు రైతులకు ఇస్తామని మాట తప్పారన్నారు.

క్రైం కార్నర్

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వినోద్ కుమార్ (ఫైల్ ఫొటో)

ఉద్యోగం రాలేదని పట్టభద్రుడైన యువకుడు మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మొలకలచెరువు మండలంలో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మొలకల చెరువు మండలం, దేవలచెరువు పంచాయితీ, మావిళ్ళవారిపల్లెకు చెందిన వసంత్ కుమార్ కుమారుడు వినోద్‌కుమా(27) డిగ్రీ వరకు చదివి ఉద్యోగ వేటలో ఉన్నాడని తెలిపారు. పలు ఇంటర్వ్యూలకు హాజరైన ఉద్యోగం రాకపో యేసరికి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడని తెఇపారు. వారం రోజులుగా మనోవేదనకు గురై ఎవరితో మాట్లా డకుండా ఉంటున్నాడని చెప్పారు. లోలోనే బాధపడుతూ నలిగిపోయిన వినోద్ కుమార్ ఈనెల 2న ఇంట్లోనే పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తిరుపతికి వెళ్లాలని సూచించడంతో కుటుంబ సభ్యులు మాత్రం పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని తెలిపారు. చెట్టంత ఎదిగిన కుమారుడు మృతి చెం దడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా వెలిపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ములకల చెరువు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.